క్లుప్తంగా

నేటి నుంచి ఉచిత యోగా తరగతులు

షాద్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని ఈశ్వర్ కాలనీలో ఉన్న అభ్యాస్ పాఠశాలలో పతాంజలీ యోగా సమితి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత యోగా శిక్షణా తరగతులు ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పానుగంటి శశిధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణను యోగా గురువు లావణ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 5.30 నుంచి సాయంత్రం 7గంటల వరకు శిక్షణ ఉంటుందని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్‌: మండల పరిధిలోని ఎలికట్ట అంబాభవానీ మాత దేవాలయ ధర్మకర్తల మండలి పదవులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబాభవానీ మాత దేవాలయం ధర్మకర్తల మండలి కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 27వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్నీ వివరాలకు 9160219190 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

మంత్రి జూపల్లికి శుభాకాంక్షలు



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌: రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కలిశారు. మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



వృద్ధుడికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

షాబాద్‌: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సురేఖ, వెల్‌స్పన్ ఫౌండేషన్ మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో వెల్‌స్పన్ ఫౌండేషన్, భాస్కర హాస్పిటల్, శ్రీ బాలాజీ దంత వైద్యశాల వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు సుమారు 80 మంది గ్రామస్తులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ సిబ్బంది రమేశ్, భాస్కర హాస్పిటల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు



గుంతల్లో మట్టిని పోయిస్తున్న గ్రామస్తులు

నందిగామ: మండల పరిధిలోని మేకగూడ గ్రామానికి చెందిన బండారు రాజు తన సొంత ఖర్చులతో గుంతలమయంగా మారిన రోడ్డుకు శనివారం మట్టిని పోయించి మరమ్మతులు చేయించాడు. మేకగూడ గ్రామం నుంచి జేపీ దర్గా రోడ్డువరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారడంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని ఆ యువకుడే స్వచ్ఛందగా ముందుకొచ్చి మరమ్మతులు చేయించాడు. దీంతో గ్రామస్తులు ఆ యువకుడిని అభినందించారు.

హామీల అమలులో విఫలం

ఆమనగల్లు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేస్తోందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్ ఆరోపించారు. పట్టణంలోని భవానీ గార్డెన్స్‌లో శనివారం ఆమనగల్లు మండల, పట్టణ బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ కో–కన్వీనర్ నర్సింహగౌడ్, కండె హరిప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కండె హరిప్రసాద్ మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని హరిప్రసాద్ కోరారు. కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవనం పూర్తయ్యేదెప్పుడో?

- ఎత్‌మార్‌పల్లిలో అర్ధంతరంగా నిలిచిన పనులు
- పిల్లర్లు పిచ్చిమొక్కలతో దర్శనం
- పట్టించుకోని అధికారులు



పిల్లర్ల దశలోనే నిలిచిన జీపీ భవన పనులు

మొయినాబాద్‌రూరల్‌: గత ప్రభుత్వ హయాంలో తండాలు, పల్లెలు ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పడ్డాయి. ఇందులో భాగంగా ఒక్కో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు చేసింది. అధికారులు పట్టించుకోకపోవడంతో జీపీ భవన నిర్మాణ పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. దీంతో ఎత్‌మార్‌పల్లిలో గ్రామ పంచాయతీ భవనం లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. పనులు పూర్తిచేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది కోరుతున్నారు.

మండల పరిధిలోని ఎత్‌మార్‌పల్లి గ్రామం కొత్త గ్రామ పంచాయతీగా గత ప్రభుత్వంలో ఏర్పడింది. ఈ గ్రామం అప్పట్లో నక్కలపల్లి గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉండేది. తండాలు, చిన్న అనుబంధ గ్రామాలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేస్తూ ప్రకటనలు చేసింది. అందులో భాగంగా ఎత్‌మార్‌పల్లిలో జీపీ పాలన డ్వాక్రా భవనంలో ఐదున్నర సంవత్సరాల పాటు కొనసాగింది. ప్రభుత్వం ద్వారా నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 20 లక్షల రూపాయలను మంజూరు చేసింది. దీంతో ఎత్‌మార్‌పల్లిలో అప్పటి సర్పంచ్ గుండాల నవనీతరాజు పాలకవర్గంతో కలిసి తీర్మానం చేసి నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. డ్వాక్రా భవనాన్ని కూల్చివేసి కొత్త భవన నిర్మాణానికి పనులను అప్పట్లో ప్రారంభించారు. సంవత్సరకాలం అవుతున్నా భవన నిర్మాణ పనులు పిల్లర్ల వరకు కొనసాగాయి. దాదాపు ఎనిమిది లక్షల వరకు నిధులు ఖర్చు చేశారు. ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరైనా అప్పట్లో ఒక్క రూపాయి కూడా నిధులు రాలేదని పేర్కొంటున్నారు. చేపట్టిన పనులకు డబ్బులు రాక అనేక ఇబ్బందులు పడుతున్నామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. నిధులు వస్తేనే పనులు పూర్తి చేయగలమని పేర్కొంటున్నారు. పిల్లర్లు పిచ్చిమొక్కలతో దర్శనం ఇస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం భవనాన్ని నిర్మించేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం నూతన మహిళా సంఘ భవనంలో జీపీ పాలన కొనసాగుతోంది.

పూర్తిచేసేందుకు కృషి చేస్తాం



ఎత్‌మార్‌పల్లి గ్రామంలో నూతనంగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు చేపట్టాం. ఆ పనులు పిల్లర్ల వరకు పూర్తయిన మాట నిజమే. జరిగిన పనుల మట్టుకే బిల్లులు వచ్చాయి. వెంటనే భవన నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్ ద్వారా కృషి చేస్తున్నాం.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ, మొయినాబాద్

సమయానుకూలంగా బస్సులు నడపాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్

షాద్‌నగర్‌రూరల్‌: విద్యాసంస్థల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు గ్రామాలకు బస్సులు నడిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సకాలంలో బస్సులు నడిపించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సకాలంలో బస్సులు రాకపోవడంతో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిచేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యార్థులకు సకాలంలో బస్సులు రాక స్కాలర్‌షిప్‌లు అందక అవస్థలు పడుతున్నారన్నారు. షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సులను నందిగామలో నిలపాలని, విద్యాసంస్థల వేళల్లో షాద్‌నగర్ నుంచి నర్సప్పగూడకు బస్సులు నడిపించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సభ్యులు సాయి, భగత్‌సింగ్, శివ, శ్రీకాంత్, విద్యార్థులు లహరి, మానస, శశికళ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అదనపు డివైడర్ తొలగింపు

స్పందించిన నాయకులకు అభినందనలు తెలిపిన స్థానికులు



డివైడర్‌ను తొలగించిన స్థానిక నాయకులు

చేవెళ్ల: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్న ప్రధాన చౌరస్తాలో రోడ్డుపై అదనంగా నిర్మించిన డివైడర్‌ను ప్రజల ఫిర్యాదుతో స్థానిక నాయకులు స్పందించి శనివారం ఉదయం తొలగించారు. దీంతో ట్రాఫిక్ సమస్య కొంత మేరకు తీరుతుందని స్థానిక ప్రజలు, వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బస్‌స్టేషన్ ఎదుట, విలేజ్ చౌరస్తాలో గతంలో కాంట్రాక్టర్ నిబంధనల మేరకు కావాల్సిన స్థలం వదిలి రాతితో డివైడర్‌ను కట్టారు. కానీ గతంలో కొంతమంది పోలీస్ ఉన్నతాధికారులు ట్రాఫిక్ సమస్యపై పర్యటించిన సమయంలో ఈ డివైడర్ మధ్యలో వదిలిన స్థలం ఎక్కువగా ఉందని దీంతో ట్రాఫిక్ సమస్య వస్తుందని అదనంగా డివైడర్‌ను పొడిగించి సిమెంట్‌తో కట్టించారు. ఇప్పుడు ఇది బస్సులు బయటకు వచ్చే సమయంలో వాహనాలు విలేజ్ రోడ్డుకు మళ్లేందుకు స్థలం తక్కువగా ఉండటంతో రోజు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ అదనపు డివైడర్‌ను తొలగిస్తే బాగుటుందని స్థానికులందరూ చర్చించుకుంటూ పలు వాట్సాప్ గ్రూప్‌ల్లో చర్చించారు. ఈ విషయంపై చర్చించిన స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ శైలజఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి దీనిని తొలగించే చర్యలు చేపట్టారు. అదనంగా కట్టిన డివైడర్‌ను తొలగించి చౌరస్తాలో ట్రాఫిక్‌జామ్ కాకుండా చేశారు. దీంతో వారికి స్థానికులు అభినందనలు తెలిపారు. అయితే ఈ అదనపు డివైడర్‌ను పోలీస్ ఉన్నతాధికారుల సూచనలతో గతంలో కట్టించింది కూడా ఈ నాయకులే కావటం విశేషం.

నేడు రక్తదాన శిబిరం

చేవెళ్ల: నేడు మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సామాజికవేత్త, ఉపాధ్యాయుడు రామకృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ రక్తదాన శిబిరం కొనసాగుతుందని చెప్పారు. గాంధీ ఆస్పత్రి వారి సౌజన్యంతో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండలంలోని యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు.

వివాహానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న చాంద్‌పాషా

షాబాద్‌: మండల పరిధిలోని హైతాబాద్ గ్రామానికి చెందిన పేదింటి మహిళ అంజమ్మ కూతురు వివాహానికి మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ చాంద్‌పాషా తనవంతు సహాయంగా రూ.11వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు గ్రామంలో మొత్తం 41 మంది ఆడబిడ్డల పెళ్లిళ్లు చేయగా వారందరికీ రూ.11వేల చొప్పున ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. నిరుపేదలకు తనవంతు సహాయం చేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సూద యాదయ్య, గ్రామ మాజీ సర్పంచ్‌లు పెద్దజంగని దర్శన్, ర్యాకల శేఖర్, గ్రామస్తులు రాజుగౌడ్, గోపాల్, ఆచారి, రాంచంద్రయ్య, జంగయ్య, ఆంజనేయులు, ఇస్తారయ్య తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

కేశంపేట: కేశంపేట గ్రామంలో దాసరి అంజమ్మ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, గ్రామానికి చెందిన గుండ్రాతి రమణయ్యగౌడ్‌లు రూ.5వేల చొప్పున, తలసాని పవన్‌కుమార్‌రెడ్డి రూ.వేల ఆర్థికసాయం మృతురాలి కుటుంబ సభ్యులకు శనివారం అందించారు. కార్యక్రమంలో అమరేశ్, శ్యాంసుందర్‌రెడ్డి, పాండుగౌడ్, ఆనంద్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



నిర్వాహకులకు విరాళం అందిస్తున్న అనంత్‌రెడ్డి

చేవెళ్ల: ఆధ్యాత్మికత చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని పామెన గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వీరభద్రస్వామి ఆలయానికి శనివారం అనంత్‌రెడ్డి 51వేల రూపాయల విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణాలకు తమవంతు సహకారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్యనారాయణచారి, గ్రామస్తులు కె.రాములు, డి.కొమురయ్య, డి.నరేందర్‌రెడ్డి, టి.గురోత్తం, రాజుగౌడ్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ మాలతి



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ మాలతి, విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్‌: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ మాలతి అన్నారు. మండల పరిధిలోని టోల్‌కట్ట సమీపంలో గల గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నవనీతరాజు పాల్గొని అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షణకు కృషి చేద్దామన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వినోలియా, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

షాద్‌నగర్‌: మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో ఉన్న చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో శ్రావణ శనివారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకిసేవ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు రఘుపతిశర్మ, రాఘవేంద్రాచార్య, కృష్ణ, ప్రమోద్, సునీల్‌ల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం భక్తులకు శ్రీలక్ష్మి గణేశ్ బోర్‌వెల్స్ యజమాని శ్రీశైలంగౌడ్ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలంగౌడ్, వసంతరావు, అన్నారం రఘుగౌడ్, రమేశ్, శ్రీశైలంయాదవ్, అశోక్, రఘునందన్‌రెడ్డి, లక్ష్మణ్, బచ్చన్న, కిషన్‌నాయక్, రాఘవేందర్, నర్సింలు, శ్రీనివాస్, నారాయణ, కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణాచారి, శంకర్‌గౌడ్, యాదగిరి, పద్మ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

క్రీడలతో మానసికోల్లాసం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: క్రీడలతోనే మానసికొల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో శనివారం వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, జాతీయస్థాయి, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. గ్రామీణస్థాయి నుంచి వచ్చిన క్రీడాకారులు ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



పాఠశాలలో సీసీకెమెరాల ఏర్పాటుకు చెక్కు అందజేస్తున్న దాతలు

చేవెళ్ల: ప్రతిఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా చేవెళ్లకు చెందిన దాతలు గుత్తి మల్లేశ్ బ్రదర్స్ బీసీ వసతి గృహం విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించి విద్యార్థులకు, పేదలకు ఆయన చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేయించారు. అనంతరం పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా చేవెళ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సీసీకెమెరాల ఏర్పాటుకు చేవెళ్లకు చెందిన గుడిపల్లి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ టేకుపల్లి శ్రీనివాస్‌లు 45వేల రూపాయల విరాళం ఉపాధ్యాయులకు అందజేశారు. తమ నాయకుడు పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా విరాళం అందించినట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ బండారి శైలజ, మండల నాయకులు దేవర సమత, బండారు ఆగిరెడ్డి, గుడిపల్లి వెంకట్‌రెడ్డి, మద్దెల శ్రీనివాస్, యువకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు

ఎస్ఐ రాజ్‌కుమార్



నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజ్‌కుమార్

కేశంపేట: నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు ఎంతగానో దోహదపడతాయని ఎస్ఐ రాజ్‌కుమార్ అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం వివిధ గ్రామాలకు చెందిన పలువురు నాయకులతో సీసీకెమెరాల ఏర్పాటుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఒక్క సీసీకెమెరా వందమంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందన్నారు. సీసీకెమెరాలు ఉండటంతో నేరస్తులను త్వరగా గుర్తించేందుకు వీలుంటుందన్నారు. గ్రామాల్లో సీసీకెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గూడ వీరేశ్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య

షాద్‌నగర్‌రూరల్‌: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ రాజీలేని పోరాటాలను కొనసాగిస్తుందని జిల్లా కార్యదర్శి వెంకటయ్య అన్నారు. యూనైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) ఉపాధ్యాయ సంఘం ఏర్పడి 50 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వెంకటయ్య, ఎంఈఓ శంకర్ రాథోడ్‌లు హాజరై శనివారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూటీఎఫ్ సంఘం ఏర్పడినప్పటినుంచి ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటాలను చేపట్టిందన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారమార్గాలను చూపించిన ఘనత యూటీఎఫ్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలయ్య, చంద్రశేఖర్, శేఖర్‌గౌడ్, రాములు, సత్యం, నర్సింలు, సురేందర్, శివరాములు, అరుణ, లక్ష్మీదేవమ్మ, శ్రీనివాస్, నర్సింలు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు